క్లుప్తంగా

నేడు 'భూ భారతి'పై అవగాహన సదస్సులు

గండేడ్/మహమ్మదాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై శనివారం గండేడ్ మండలం వెన్నాచేడ్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు అన్ని గ్రామాల రైతులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

■ మహమ్మదాబాద్ మండలం నంచర్లగేట్ పల్లవి ఆడిటోరియంలో శనివారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తిరుపతయ్య తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సదస్సుకు కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, రైతులు, మహిళలు పాల్గొనాలని కోరారు.

వాసవీ మాతకు పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం చేశారు. అనంతరం వాసవీ మాతకు పల్లకీ సేవ నిర్వహించి.. మహా మంగళహారతి ఇచ్చారు.

పోస్టర్ ఆవిష్కరణ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం కవి ఉదయమిత్ర అనువాదం చేసిన సొంతూరు అలివివల (కథలు) పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పుస్తకావిష్కరణకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు నయీముద్దీన్, యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు నర్సింహులు, తెలుగు సత్తయ్య, వెంకటేశ్ మాట్లాడుతూ.. పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ప్రొఫెసర్ హరగోపాల్ హాజరవుతారని.. సాహితీ ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మార్కెట్‌లో క్రయవిక్రయాలు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సెలవుతో మార్కెట్‌లో లావాదేవీలు జరగలేదు. శనివారం టెండర్ల ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు కొనసాగుతాయని తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం





మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/నవాబుపేట: ఏబీవీపీ పాలమూరు విభాగ్ వ్యవస్థాక ప్రముఖ్ కె.తపాలా లక్ష్మణ్‌కు గురువారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సభ్యులు డాక్టరేట్ ప్రదానం చేశారు. కాగా, స్ఫూర్తి అకాడమీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాల్లో 59 మంది గర్భిణులకు ఆయన రక్తదానం చేశారు.

■ నవాబుపేట మండలంలోని సత్రోనిపల్లితండాకు చెందిన మల్లికార్జున్ నాయక్‌కు డాక్టరేట్ లభించింది. యూత్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో చేసిన కృషికి గాను ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ సొసైటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు మల్లికార్జున్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ రమేశ్‌తో పాటు కొల్లూర్, సత్రోనిపల్లితండా నాయకులు చందర్‌నాయక్, తులసీరాం నాయక్, లింగంనాయక్, సేవ్యా నాయక్ తదితరులు అభినందనలు తెలిపారు.

రోగులకు పండ్ల పంపిణీ



దేవరకద్ర: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం బీజేపీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. దేవరకద్ర నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, నాగిరెడ్డి, దేవన్నసాగర్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

- విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు
- నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. స్థానిక 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని స్టేషన్ రోడ్డు, స్టేడియం గ్రౌండ్, తెలంగాణ చౌరస్తా, మర్లు, నవాబ్‌పేట రోడ్డు, వీబీపీ ఫీడర్, వెంకటేశ్వర కాలనీ, జిల్లా పరిషత్, టౌన్–1 తదితర ఫీడర్లలో అత్యవసర పనులు చేపడుతున్నారు. విద్యుత్‌శాఖ ఏడీ తవుర్యా నాయక్ పర్యవేక్షణలో ఈ నెల 8నుంచి రోజు ఉదయం 7నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి తీగలను అనుసరించి ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్నారు. కాగా, ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో చేపట్టాల్సిన పనులను ఈ ఏడాది కాస్త ముందుగానే చేపట్టారు. ప్రస్తుతం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షాలు పడుతుంటాయని.. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపటినట్లు అధికారులు వివరిస్తున్నారు. విద్యుత్ అంతరాయానికి సహకరిస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



రాజేంద్రనగర్‌లో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

■ విద్యుత్ మెయింటనెన్స్‌లో భాగంగా టౌన్–1, కేసీఆర్ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 7నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ హరినాథాచారి, టౌన్ 2 ఏఈ ఆదిత్య శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పట్టణంలోని మోటార్ లైన్, రామయ్యబౌలి, పాత పాలమూరు, జిల్లా జైలు, భగీరథ కాలనీ, కృష్ణనగర్, నాగిరెడ్డి కాలనీ, మధురానగర్, సింహగిరి, కొత్త చెరువు రోడ్డు, ఖలీల్ చౌక్, బొడ్రాయి చౌరస్తా, మార్కెట్‌యార్డు, లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ఊపిరి.. బీఆర్ఎస్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల/నవాబుపేట: తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ ఊపిరిలాంటిదని.. ప్రజల గుండెల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం జడ్చర్ల తిరుమల హిల్స్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించి పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న అధికార పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం నవాబుపేట మండలంలోని చెన్నారెడ్డిపల్లి, ఇప్పటూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌రైటింగ్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ యాదయ్య, నాయకులు రామ్మోహన్, దేవ, జ్యోతి, మండల అధ్యక్షుడు నర్సింహులు, నాగిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అనంతయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవరగుట్టపై నిఘా నేత్రం



నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల దేవరగుట్టలో శుక్రవారం అటవీశాఖ అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా రెండు చిరుతలు దేవరగుట్టను ఆవాసంగా మార్చుకున్న నేపథ్యంలో వాటి కదలికలను పసిగట్టి బంధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. కాగా, దేవరగుట్ట సమీపంలో కట్టేసిన ఓ లేగదూడ గురువారం రాత్రి నుంచి కనిపించడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికే చాలా కుక్కలు కనిపించకుండా పోగా.. తాజాగా కిలోమీటర్ దూరంలోని వ్యవసాయ పొలంలో కట్టేసిన లేగదూడ అదృశ్యం కావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. చిరుతలను బంధించే ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

గండేడ్/మిడ్జిల్: ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. శుక్రవారం మిడ్జిల్ మండలం వస్పుల గ్రామంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అల్వాల్‌రెడ్డి, సత్యం, బంగారు, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

■ గండేడ్ మండలం లింగాయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటను దళారుల చేతుల్లో పెట్టి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు అనంత లక్ష్మారెడ్డి, పుల్లారెడ్డి, ఆశిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.



వస్పులలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి

సీసీరోడ్డు పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఒకటో వార్డు తిమ్మసానిపల్లిలో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. కార్యక్రమంలో స్థానికులు పల్లె వెంకటేశ్, వరద రవి, పల్లె నర్సింహులు, రాఘవ, శోభ పాల్గొన్నారు.

పేదింటి యువతి వివాహానికి ఆర్థికసాయం

జడ్చర్ల టౌన్: మండలంలోని బోయిలకుంటకు చెందిన నిరుపేద మాధవి కూతురు ప్రసన్న వివాహానికి శుక్రవారం చర్లపల్లికి చెందిన వి.శ్రీనివాస్‌గౌడ్ రూ.51వేల ఆర్థికసాయం అందించారు. వధువు తండ్రి శేఖర్‌గౌడ్ కొంతకాలం క్రితం మృతిచెందాడు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి తనవంతు సాయం అందించిన శ్రీనివాస్‌గౌడ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

వర్క్‌ఫ్రం హోమ్ పేరుతో కుచ్చుటోపీ

రాజాపూర్(బాలానగర్): వర్క్‌ఫ్రం హోమ్ పేరుతో ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. బాలానగర్ మండలం ఉడిత్యాల మామిడిగుట్ట తండాకు చెందిన లావుడ్యా శంకర్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం తన వాట్సప్‌లో 72869 42642 నంబర్ నుంచి వర్క్‌ఫ్రం హోమ్ అంటూ వచ్చిన మెసేజ్ నిజమని నమ్మాడు. వర్క్‌ఫ్రం హోమ్ చేయడానికి కొంత డబ్బు కట్టాల్సి వస్తుందని చెప్పగా.. గత ఫిబ్రవరి 18న రూ. 1,200 సదరు వ్యక్తి అకౌంట్‌లో జమ చేశారు. మరుసటి రోజు మరో రూ. 10వేలు పంపిస్తే పనిచేయడానికి వీలుంటుందని చెప్పడంతో మళ్లీ పంపించారు. ఇలా బాధిత శంకర్ నుంచి దాదాపు రూ. 1.72లక్షలు కాజేశారు. చివరకు తాను మోసపోయానని గ్రహించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

జడ్చర్ల టౌన్/అడ్డాకుల/చిన్నచింతకుంట: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. జడ్చర్ల ఎంబీ బేథని చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఫిలెమోన్ అధ్యక్షత వహించగా.. ప్రారంభ ప్రార్థన జోసఫ్ చేశారు. క్రీస్తు ఏడు మాటలను ఏడుగురు వివరించారు. అనంతరం చర్చి ఫాస్టర్ రెవ. విలియం బూత్ ఆశీర్వాదంతో వేడుకలు ముగించారు. ఆరాధనోత్సవాలను సంఘ పెద్దలు ఫిలెమోన్, కార్యదర్శి తిమోతి, కోశాధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

■ అడ్డాకులలోని ఎంబీ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ చంద్రశేఖర్ ప్రసంగిస్తూ.. ఏసుక్రీస్తు కల్వరి శిలువలో తన రక్తం చిందించడం వల్ల సర్వమానవాళికి విమోచనం కలిగిందని అన్నారు. కార్యక్రమంలో ఆనందం, డేవిడ్, చంద్రశేఖర్, సురేష్, రాజేశ్, సుందర్, బాలరాజు, సామెల్, సుదర్శన్ పాల్గొన్నారు.



చిన్నచింతకుంట చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

■ చిన్నచింతకుంట ఎంబీ సియోన్ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా 40 రోజులపాటు క్రైస్తవులు చేపట్టిన ఉపవాస దీక్షలను విరమించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు శిలపై పలికిన ఏడు మాటలు ధ్యానించారు. అనంతరం పలువురు భక్తిగీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా చర్చి కార్యదర్శి జి.యోనా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శాంతి, ప్రేమ, దయాగుణం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏఎస్ గిద్యోన్, జి.మోషే, ఆనంద్, సి.సుదర్శన్, జి.పిలోగు, ఎస్.శేఖర్, జీవై ప్రతాప్, ఎల్ఎం రాజు, సి.యాకోబ్, ఎస్.మాలగర్, సి.సౌల్ రాజు, బాబు పాల్గొన్నారు.

నేడు రన్ ఫర్ జీసస్..

వేడుకల్లో భాగంగా శనివారం జడ్చర్ల ఎంబీ చర్చి ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాస్టర్ విలియంబూత్ తెలిపారు. చర్చి నుంచి నేతాజీ చౌరస్తా రైల్వే బ్రిడ్జి, సిగ్నల్‌గడ్డ మీదుగా చర్చి వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. రన్ ఫర్ జీసస్‌లో పాస్టర్లు, సంఘం పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



జడ్చర్ల ఎంబీ బేథని చర్చిలో..



అడ్డాకులలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

గ్రామీణ రహదారులకు మహర్దశ



దొర్రితండా బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: ప్రజా పాలనలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రం నుంచి దొర్రితండాకు బీటీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. దొర్రితండాకు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రూ. 2.24 కోట్లతో బీటీరోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి తండాకు బీటీరోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో అందిస్తున్న సన్నబియ్యంతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ దళిత కుటుంబంతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు షబ్బీర్, లింగం, కృష్ణయ్య, సుధాకర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం..

పాలమూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే యెన్నం ప్రారంభించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఆస్పత్రుల యజమానులు, సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్‌స్టేషన్ అధికారులు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో ఫైర్ ఎక్విప్‌మెంట్ వాడకం వంటి అంశాలను జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి పి.కిషోర్ వివరించారు. అదే విధంగా మహబూబ్‌నగర్‌లో పనిచేసి వనపర్తి జిల్లా అగ్నిమాపక అధికారిగా బదిలీపై వెళ్లిన బి.ధర్మ, సూపరింటెండెంట్ శశిధర్, ఖాజాపాషాలకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ అధికారి మల్లిఖార్జున్, జడ్చర్ల ఫైర్ స్టేషన్ అధికారి రాజేందర్ పాల్గొన్నారు.

హమ్మయ్య.. పోల్కంపల్లికి రోడ్డేశారు!

- రెండేళ్ల తర్వాత పూర్తయిన బీటీరోడ్డు పనులు



పోల్కంపల్లికి నిర్మిస్తున్న బీటీరోడ్డు

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామస్తుల బీటీరోడ్డు కల ఎట్టకేలకు నెరవేరింది. రెండేళ్ల నుంచి కంకర రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న గ్రామస్తులు.. బీటీ నిర్మాణంతో ఊపిరి పీల్చుకున్నారు. 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి పోల్కంపల్లి మీదుగా వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కమాలుద్దీన్‌పూర్ వరకు బీటీరోడ్డుతో పాటు మార్గమధ్యంలోని పెద్దవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. 2023 ఏప్రిల్ 10న రోడ్డు పనులకు అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు మొదలైన కొన్నాళ్లకే హైవే నుంచి పెద్దవాగు వరకు కంకర వేసి వదిలేశారు. సమారు రెండేళ్లు కంకర రోడ్డుతో గ్రామస్తులు అవస్థలు పడ్డారు. వాహనాలు వెళ్లినప్పుడు పెద్దఎత్తున దుమ్ము చెలరేగడంతో ప్రజలు శ్వాసకోస సమస్యలు ఎదుర్కొన్నారు. దీనిపై గ్రామస్తులు పలుమార్లు ప్రస్తుత ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బీటీరోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చారు. ఎట్టకేలకు గురువారం బీటీరోడ్డు పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్.. శుక్రవారం పనులను పూర్తి చేశారు. పంచాయతీరాజ్ డీఈ లక్ష్మణ్‌గౌడ్ రోడ్డు పనులను పర్యవేక్షించారు. బీటీరోడ్డు పనులు పూర్తి కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు పనులను పూర్తి చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

జడ్చర్ల: వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జడ్చర్ల పట్టణంలో ముస్లిం మైనార్టీలు భారీ ర్యాలీ నిర్వహించారు. నిమ్మబాయిగడ్డ, కావేరమ్మపేట నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తంచేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదన్నారు. భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేంద్రం నిర్ణయాలు తీసుకోవడం తమ హక్కులకు భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ.. కేంద్ర సర్కార్‌కు విన్నవించాలని కోరారు. ముస్లింల హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ దానీష్, నాయకులు ఇమ్ము, మినాజ్, ఇబ్రహీం, అబ్దుల్లా, ఖాజా పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న మోహన్

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధిహామీ పథకం కూలీలకు సకాలంలో కూలి డబ్బులు చెల్లించడంతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కోడూర్‌లో ఉపాధిహామీ పథకం పనులు చేస్తున్న కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు సకాలంలో కూలి డబ్బులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా రెగ్యులర్‌గా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతినెలా వేతనాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భగవంతు, లావణ్య, భీమమ్మ, మమత, పద్మమ్మ, శారద, వెంకటమ్మ, గోవిందమ్మ, సుగుణమ్మ, సావిత్రి, మన్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద

మహబూబ్‌నగర్ రూరల్: ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద సూచించారు. మహబూబ్‌నగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఎదిర అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. చిరుధాన్యాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శివశంకర్, యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, కమల, ఉమాదేవి, భారతమ్మ, స్వరూప, వనమాల పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల: పట్టణంలోని సాయి వాసవీ కాలనీకి చెందిన కాత్రావత్ తిరుపతి (30) గురువారం నుంచి కనిపించకుండా పోయాడని సీఐ కమలాకర్ తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లి న అతడు తిరిగి రాలేదని.. కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. తిరుపతి బార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక డంపు సీజ్

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను శుక్రవారం పోలీసులు సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజు మాట్లాడుతూ.. మండలంలో అనుమతి లేకుండా ఇసుక రవాణాకు పాల్పడినా, ఇతర ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.